# అమ్మ

- మల్లాది వెంకట కృష్ణమూర్తి



నువ్వీ లోకంలోకి రాగానే, ఆమె నిన్ను తన చేతులతో ఎత్తుకుంది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు తెలియచేసావు, సైరన్‌లాగా ఏడ్చి.

నీ ఒకటోఏట ఆమె నీకు స్నానం చేయించి అన్నం పెట్టింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, రాత్రంతా ఏడుపుతో ఆమెకి నిద్ర లేకుండా చేసి.

నీ రెండోఏట ఆమె నీకు నడక నేర్పింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు పిలవగానే రాకుండా పరిగెత్తుకెళ్ళిపోయి.

నీ మూడోఏట ఆమె నీకోసం ప్రేమగా అన్నం వండింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, అన్నం నేలమీద వలకపోసి.

నీ నాలుగోఏట ఆమె నీకు బొమ్మలు గీయడం నేర్పింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, గోడలమీద, డైనింగ్ టేబుల్ మీద పిచ్చిగీతలు గీసి.

నీ అయిదోఏట నీకామె ప్రేమగా కొత్తబట్టలు తొడిగింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, మట్టిలో వాటిని మురికి చేసుకొచ్చి.

నీ ఆరోఏట నిన్నామె స్కూలుకి తీసుకెళ్ళింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు నేను వెళ్ళనని ఏడ్చి.

నీ ఏడోఏట నీకామె క్రికెట్ బంతి కొనిచ్చింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, పక్కింటి వాళ్ళ కిటికీ అద్దాలని దాంతో పగులగొట్టి.

నీ ఎనిమిదోఏట నీకామె ఐస్‌క్రీం కొనిచ్చింది.

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు దాన్ని ఆమె వళ్ళంతా పూసి.

నీ తొమ్మిదోఏట మీ నాన్నతో పోట్లాడి ఆమె నీకు సంగీతం నేర్పించింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు ఆ సంగీతం ప్రాక్టీస్ చేయకుండా.

నీ పదోఏట ఆమె నీకు పుస్తకాలకి అట్టలు వేసి పెట్టింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, వాటిని చదవకుండా.

నీ పదకొండోఏట ఆమె నీకు జ్వరమొస్తే సేవ చేసింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, పాయసం వండిస్తే కాని మందు తాగనని.

నీ పన్నెండోఏట నీ బాగుకోరి టి.వి. చూడడం తగ్గించమంది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, దొంగతనంగా టి.వి. చూసి.

నీ పదమూడో ఏట నిన్ను చక్కగా హెయిర్ కట్ చేసుకోమంది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, నీకసలు టేస్ట్ లేదమ్మా అని.

నీ పద్నాలుగో ఏట నిన్నామె శెలవుల్లో నీ ఫ్రండ్ ఊరికి పంపింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, ఎలావున్నావని ఉత్తరం రాయకుండా.

నీ పదిహేనోఏట ఆమె ఆఫీస్‌నించి వచ్చాక నీ హోంవర్క్ పుస్తకాలు చూడాలనుకుంది.

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, 'పోమ్మా అవన్నీ నీకెందుకు?' అని.

నీ పదహారోఏట ఆమె ఓ ముఖ్యమైన ఫోన్‌కాల్ కోసం ఎదురుచూసింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, నీ ఫ్రండ్‌తో ఫోన్లో అరగంటసేపు మాట్లాడి.

నీ పదిహేడో ఏట ఆమె నీతోపాటు మేల్కొని నీకు 'యంసెట్' రాంక్ వచ్చేలా చదివించింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, నీ కృతజ్ఞతలు తెలియచెయ్యకుండా.

నీ పద్దెనిమిదోఏట నువ్వెంత అందంగా ఉన్నావోనని ఆమె నిన్ను మెచ్చుకుంది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, నీ జుట్టు తెల్లబడుతోందమ్మ అని.

నీ పందొమ్మిదో ఏట 'ప్రేమ విషయంలో జాగ్రత్త' అని నిన్నామె హెచ్చరించింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, ఆమెకి సరిపడని వాళ్ళతో ప్రేమలో పడి.

నీ ఇరవైయవఏట నీ కెరీర్‌కి ఏది ముఖ్యమో ఆమె సజెస్ట్ చేసింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతని చెప్పావు, 'నువ్వు బి.సి. నాటి దానివి నీకేం తెలీదమ్మా' అని.

నీ ఇరవైఒకటోఏట నువ్వు బి.ఇ. పాసైనందుకు నిన్ను మెచ్చుకుంది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, అమెరికాకి టిక్కెట్ కొనివ్వమని.

నీ ఇరవైరెండోఏట నువ్వు అమెరికాకి వెళ్తుంటే ఆమె సంబరపడింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, ఎయిర్‌పోర్ట్‌లో ఆమె ఏడిస్తే "అసహ్యంగా ఏమిటిది అంతా చూస్తున్నారు" అని కసిరి.

నీ ఇరవై మూడో ఏట నీకామె స్వయంగా చేసిన పచ్చళ్ళు పంపించింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, కారం ఎక్కువగా వుందని ఇక్కడన్నీ దొరుకుతాయి పంపొద్దని.

నీ ఇరవైనాలుగోఏట ఆమె నీకోసం సంబంధాలు చూస్తున్నానని చెప్పింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, నీ ఇరవై అయిదోఏట ఆమెకి చెప్పకుండా పెళ్ళి చేసుకుని.

నీ ముప్పయ్యవ ఏట ఆమె 'నీకెప్పుడు పిల్లలు?' అని ఆర్తిగా అడిగింది.

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, అమెరికా గురించి, డాలర్స్ గురించి నీకు బొత్తిగా తెలీదని.

నీకు ముప్పయ్ అయిదో ఏట ఆమె తమ షష్ఠిపూర్తికి రమ్మని నిన్ను ఆహ్వానించింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, 'నేను నిజంగా బిజీగా వున్నాను రాలేనని' చెప్పి.

నీ నలభయ్యవ ఏట 'మంచాన పడ్డ మీ నాన్నగారు నీకోసం కలవరిస్తున్నారు ఓసారి రా' అని ఫోన్ చేసింది:

నువ్వామెకి కృతజ్ఞతలు చెప్పావు, వెయ్యి డాలర్లకి చెక్కు పంపి.

నీ నలభై అయిదో ఏట ఆవిడ జబ్బు పడింది:

నువ్వామెకి నీ కృతజ్ఞతలు చెప్పావు, "నీకేం కాదు ఫాల్‌లో కాని రాలేను' అని.

నీ ఏభైయవ ఏట ఆమె మరణించిందని ఫోన్ వచ్చింది:

నువ్వామెకి కృతజ్ఞతని చెప్పావు, 'వచ్చేదాకా ఏం వుంచుతారు? తీసెయ్యండి' అని.

నీ యాభై అయిదో ఏట ఓ రాత్రి నువ్వు నీ తల్లి కోసం ఏడ్చావు.

నువ్వామెకి మరిచిన నీ కృతజ్ఞతలు తెలియచేయనందుకు కాదు.

'చూశావా అమ్మా! మా అబ్బాయితో నువ్వెంత అందంగా ఉన్నావో' అంటే 'నీ జుట్టు తెల్లబడుతోంది నాన్న' అన్నాడని చెప్పుకోడానికి నీకు అమ్మలేదని. అప్పుడైనా నీకు గుర్తుకు వచ్చిందా పుట్టుక నించి, మరణం దాకా దుఃఖంలో గుర్తొచ్చేది తల్లేనని.

❀

